క్లుప్తంగా

సీఎం రేవంత్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



మద్దూరు: మండల కాంగ్రెస్ నాయకులు శివ రాజ్, మల్లికార్జున్, సతీష్ శనివారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని సచివాలయంలో కలిసినట్లు తెలిపారు. సీఎంగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటి సారిగా కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలో జరగాల్సిన అభివృద్ధి పనులను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు వారు పేర్కొన్నారు.

'సర్వే అధికారులపై చర్య తీసుకోవాలి'

ధన్వాడ: మండలంలోని కిష్టాపూర్‌లో సర్వేనంబర్ 142లో సర్వే చేసేందుకు వచ్చిన అధికారులు కాంగ్రెస్ నాయకులు ఇంట్లో కూర్చొని పంచనామాచేసి సర్వే చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ యుజన సంఘం అధ్యక్షుడు సునిల్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

లెక్చరర్ మృతికి సంతాపం

మక్తల్: పట్టణంలోని ఎల్లమ్మకుంటకు చెందిన వెంకటమ్మ (56) శనివారం అనారోగ్యంతో మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, మాజీ ఎంపీపీ కొండయ్య అక్కడికి చేరుకుని వెంకటమ్మ భర్త రిటైర్డ్ టీచర్ గోపాలంను పరామర్శించారు.

ఉపాధి కూలి డబ్బులు ఇవ్వాలి



ఆత్మకూర్: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పనులు చేసిన కూలీలకు రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న కూలి డబ్బులను వెంటనే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు అన్నారు. శనివారం మండలంలోని తూంపల్లిలో ఉపాధి కూలీలతో సమావేశమయ్యారు. సంబంధిత అధికారులు కూలీల ఈకేవైసీని త్వరతగతిన పూర్తి చేసి పెండింగ్ కూలి డబ్బులను ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఆర్టీసీ బస్సుసర్వీస్‌ను పునరుద్ధరించండి



ఆత్మకూర్: పట్టణ కేంద్రం నుంచి రేచింతల వరకు వనపర్తి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని కోరుతు శనివారం స్థానికులు వనపర్తి డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. బస్సును అర్ధాంతంగా నిలిపివేయడంతో ప్రయానికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, ఈవిషయాన్ని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి దృష్టికి తీసుకెళ్లగా డీఎంకు లేఖ రాసి ఫోన్ ద్వారా మాట్లాడినట్లు వివరించారు. కార్యక్రమంలో మహేశ్వర్‌రెడ్డి, బాలరాముడు, నాగేశ్వర్‌రెడ్డి, రాములు, సత్యారెడ్డి, సోమిరెడ్డి, మాధవరెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రసాదం పంపిణీ



ఆత్మకూర్: తిరుమల తిరుపతి దేవస్థానంలో ఆత్మకూర్ అభివృద్ధి కోసం మొక్కులు తీర్చుకొన్నట్లు వార్డు మాజీ సభ్యుడు గడ్డమీది శ్రీనివాసులు తెలిపారు. బీసీ కాలనీకి చెందిన యువతతో కలిసి తిరుపతి శ్రీవేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా తిరుపతి ప్రసాదాన్ని వార్డులో పంపిణీ చేశారు.

9న వ్యాసరచన పోటీలు

స్టేషన్ మహబూబ్‌నగర్: స్వామి వివేకానంద జయంతి సందర్భంగా భారత్ వికాస్ పరిషత్ పాలమూరుశాఖ ఆధ్వర్యంలో ఈనెల 9న పాఠశాల విద్యార్థులకు ఇంగ్లీష్, తెలుగులో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు పి.రమేష్‌చందర్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 6 నుంచి 8 తరగతుల విద్యార్థులకు జూనియర్స్ విభాగంలో 9,10 తరగతుల వారికి సీనియర్స్ విభాగంలో వ్యాసరచన పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. పోటీల్లో గెలుపొందిన బహుమతులతోపాటు పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు.

ముగిసిన ప్రజాపాలన దరఖాస్తులు



మాగనూర్‌లో ఆన్‌లైన్ నమోదును పరిశీలిస్తున్న ఎంపీడీఓ శశికళ

మక్తల్: ప్రజాపాలనలో దరఖాస్తులు అందజేసిన అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. శనివారం మున్సిపాలిటీలోని 14వార్డులో ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రజలతో దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల నుంచి సమస్యలతో కూడుకున్న దరఖాస్తులు వేల సంఖ్యలో అందుతున్నాయని, ప్రతి నిరుపేద కుటుంబానికి లబ్ధిచేకూరేలా ప్రభుత్వ సహాయం అందుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి జాన్‌సుధాకర్, చైర్‌పర్సన్ పావనీ, కమిషనర్ బాల్‌రాంనాయక్, వైస్ చైర్మన్ అఖిలరెడ్డి, కౌన్సిలర్లు స్వేతారెడ్డి, కౌసల్య, అర్చన, మొగులప్ప, కొండయ్య, చీరాల సత్యనారాయణ, ప్రసన్నరెడ్డి, రాములు పాల్గొన్నారు.

మద్దూరు: గత నెల 28నుంచి ప్రారంభమైన ప్రజాపాలన దరఖాస్తులు శనివారంతో ముగిశాయి. మద్దూరు, కొత్తపల్లి మండలాల్లోని 49పంచాయతీల్లో ప్రజాపాలన దరఖాస్తులు 20,253 దరఖాస్తులు రాగా మిగితా దరఖాస్తులు 7004 వచ్చినట్లు ఎంపీడీఓ తెలిపారు. శనివారం ప్రజాపాలన భీంపూర్‌లో 161దరఖాస్తులు, ఇతర 64, ఎర్రగుంటతాండాలో 153, ఇతర దరఖాస్తులు 66, కిషన్‌నగర్‌లో 161, 66, పెద్దతాండాలో 133, 30, మేడికుంటతాండాలో 126,59, లింగల్‌చేడ్‌లో 156,72, దామ్లతాండాలో 112,61, జాధరావుపల్లితాండాలో 139, 62, వాల్యానాయక్‌తాండాలో 99,40, చంద్ర్యనాయక్ తాండాలో 127, 50 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం ప్రజాపాలన దరఖాస్తులు 2,308, ఇతర దరఖాస్తులు 1,039 వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహా, వివిధ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజాపాలనకు 14623 దరఖాస్తులు..

దామరగిద్ద: గత నెల 28తేదీ నుంచి నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా శనివారం నాటికి 14623దరఖాస్తులు అందినట్లు మండల ప్రత్యేక అధికారి డీఆర్‌డీఓ గోపాల్‌నాయక్, ఎంపీడీఓ శ్రీధర్, తహసీల్దార్ నాగజ్యోతి అన్నారు. అన్ని దరఖాస్తులను పరిశీలించి అర్హులను గుర్తించి పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు..

మాగనూర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ శనివారం ముగియడంతో మండల ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ ఎంట్రీ కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. కలెక్టర్ ఆదేశాలతో డాటా ఎంట్రీ పనులను ఎంపీడీఓ శశికళ దగ్గర ఉండి చేయించారు. మొదటిరోజు నుంచి చివరిరోజు వరకు మొత్తం 8702 దరఖాస్తులు స్వీకరించినట్లు ఆమె తెలిపారు.



మక్తల్‌లో దరఖాస్తు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే



మద్దూర్‌లో దరఖాస్తులు ఇస్తున్న ప్రజలు

శబరికి తరలిన అయ్యప్ప స్వాములు



నారాయణపేటలో ఇరుముడి కట్టుకుంటున్న అయ్యప్పమాలాధారులు



వాహనాల్లో శబరికి తరలివెళ్తున్న స్వాములు

నారాయణపేట రూరల్ : పట్టణం, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన 80మంది అయ్యప్ప మాలాధారులు శనివారం శబరిమలకు తరలివెళ్లారు. 41రోజులపాటు నిష్ఠతో దీక్షను పూర్తిచేసి అయ్యప్ప సన్నిధానంలో మాలా విరమణకు బయలుదేరారు. ఈ మేరకు యాద్గీర్‌రోడ్డులోని ఆలయంలో స్వామివారి మూల విరాట్‌కు అభిషేకం, అర్చన, హారతి తదితర పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం గురుస్వాముల ఆధ్వర్యంలో అన్నదానం చేసి వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో వెంకటప్ప, బాలరాజు, అశోక్, రాజు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని పులిమామిడిలో శనివారం ఇరుముడి కట్టుకుని అయ్యప్పస్వాములు ప్రత్యేక వాహనాల్లో శబరికి బయలుదేరారు. 33మంది అయ్యప్ప భక్తులు 41రోజులు దీక్ష చేపట్టి స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో భక్తి శ్రద్ధలతో ఇరుముడి కట్టుకుని బయలుదేరారు. కార్యక్రమంలో గురుస్వాములు నరేష్, రాఘవేందర్, చెన్న కేశవులు, ఆంజనేయులు చారి, నర్సింహులు, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

10న మండల సర్వసభ్య సమావేశం

నారాయణపేట రూరల్: మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 10న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు చెప్పారు. సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, మండలస్థాయి అన్నిశాఖల అధికారులు విధిగా హాజరు కావాలన్నారు. ఇప్పటి వరకు నివేదికలు అందించని శాఖలు వెంటనే మండల పరిషత్ కార్యాలయంలో అందించాలని కోరారు.

విద్యాభివృద్ధికి కృషిచేయాలి

కృష్ణా: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శనివారం కాంప్లెక్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ నోడల్ అధికారి నిజాముద్దీన్ మాట్లాడుతూ.. ప్రధానంగా ఎఫ్ఎల్ఎన్ అంశాలు, ఎఫ్ఆర్ఎస్, ఎడ్యుకేషన్ యాప్ తదితర అంశాలపై ఉపాధ్యాయులకు సూచనలు అందజేశారు. అదేవిధంగా తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మండలంలో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషిచేయాలన్నారు. విద్యార్థులకు సులభంగా ఇంగ్లిష్‌పై పట్టు సాధించేందుకు తగు సలహాలను సూచనలు అందజేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ అధికారులు నాగరాజు, శంకర్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా ఏకమవుదాం



మాట్లాడుతున్న ఫోరం ప్రతినిధులు

స్టేషన్ మహబూబ్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా ముస్లింలు, దళితులు, ఆదివాసీలు, బీసీలు, క్రైస్తవులు, ఇతర సెక్యూలర్ వాదులందరూ ఏకం కావాల్సిన అవసరం ఉందని యునైటెడ్ ముస్లిం అడ్వయిజరీ ఫోరం ప్రతినిధులు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఫోరం కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చిన్నపాటి నిర్లక్ష్యం, అలసత్వం ప్రదర్శిస్తే అది మతోన్మాద శక్తులకు బలాన్ని చేకూరుస్తుందన్నారు. అటువంటి వారికి అధికారాన్ని దూరం చేయడానికి ఐక్యంగా పనిచేద్దామని కోరారు. ఫోరం కన్వీనర్ గులాం గౌస్, కోకన్వీనర్లు ఖాలెద్ నవీద్, హాజి సలీం, మీర్ షోయబ్అలీ, షేక్ సిరాజుద్దీన్, మౌల్వి మహ్మద్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ రాముడి అక్షతల పంపిణీ



నారాయణపేటలో సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

నారాయణపేట రూరల్ : ప్రతి ఒక్కరూ ఆయోధ్యను సందర్శించాలని ఆర్ఎస్ఎస్ కార్యవాహ మ్యాడం ప్రభాకర్ అన్నారు. శనివారం మండలంలోని కొల్లంపల్లిలో నిర్వహించిన అయోధ్య శ్రీరామజన్మభూమి కురుక్షేత్ర కార్యక్రమానికి అయన ముఖ్యవక్తగా హాజరై మాట్లాడారు.. నేటి తరానికి రామాయణాన్ని తెలియజేయాలని, పాఠ్య పుస్తకాల్లో పొందుపర్చాలన్నారు. అంతకుముందు గ్రామంలో రాంమందిర్ నుంచి వేంకటేశ్వర ఆలయం వరకు అయోధ్య నుంచి తీసుకొచ్చిన అక్షతలను భక్తి శ్రద్ధలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ సాయిరెడ్డి, ఉప సర్పంచ్ వడెప్ప, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నర్వ: అయోధ్య తీర్థ క్షేత్ర ట్రస్టు అందించిన రాముడి అక్షతల పంపిణీ కార్యక్రమం శనివారం మండలంలోని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వేంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి, శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని అన్ని కాలనీలో శ్రీరామ భక్తజన బృందం సభ్యులు ఇంటింటికీ వెళ్లి రాముడి అక్షతలు, కరపత్రం, చిత్రపటాలను అందజేశారు. ఈ నెల 22న అయోధ్యలో శ్రీ రామ మందిర ప్రారంభం సందర్భంగా 5 దీపాలను తప్పకుండా వెలిగించాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు రవీందర్‌రెడ్డి, ప్రతిభ హన్మంత్‌రెడ్డి, పరుషరాంరెడ్డి, శేఖర్‌రెడ్డి, నర్సింహులు, శంకర్, అయ్యన్న, రవికుమార్‌రెడ్డి, వెంకట్రామ్‌రెడ్డి, నరేష్ పాల్గొన్నారు.



నర్వలో అక్షతలు అందిస్తున్న సభ్యులు

మక్తల్: పట్టణంలో 14వార్డులో శనివారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చేతుల మీదుగా అక్షతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలుచేసి మొక్కుల చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కర్నిలక్ష్మి, కర్నిస్వామి, ఆంజనేయులు, హన్మంతు, శ్రీనివాస్, గోవర్దన్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మరికల్: అయోధ్య నుంచి వచ్చిన అక్షితలను మండలంలో విశ్వహిందు, భజరంగదళ్ ఆధ్వర్యంలో శనివారం ఇంటింటికీ పంపిణీ చేశారు. వార్డుల వారీగా టీములను ఎంపిక చేసి ఇంటింటికీ అక్షతలు చేరేలా చర్యలు తీసుకున్నారు. అలాగే పెద్దచింతకుంట తదితర గ్రామాల్లో అయోధ్య అక్షతలను ఊరేగింపుగా వెళ్లి ఇంటి సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో విశ్వహిందు, భజరంగదళ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ధన్వాడ: ధన్వాడ, కంసాన్‌పల్లి గ్రామాల్లో శనివారం ఉదయం ఆయోధ్య నుంచి వచ్చిన రాముడి అక్షతలను భజన చేస్తూ ఉత్సవ కమిటీ సభ్యులు ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో భాస్కర్, వీరేష్, రాఘవేందర్, యాదయ్య, శంకర్, సతీష్, చంద్రశేఖర్, హన్మంత్, రాజుసాగర్, రాములు, రాంచంద్రయ్య, వెంకటేష్, సతీష్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: అయోధ్యలోని శ్రీరామ మందిరం ప్రారంభం సందర్భంగా ఇంటింటికీ అక్షలు పంపిణీ నిర్వహిస్తున్నట్లు మందిపల్లి గ్రామ పెద్దలు తెలిపారు. శనివారం మక్తల్ నుంచి తీసుకొచ్చిన అక్షతలను గ్రామస్తులు ఊరేగింపుగా తీసుకొచ్చి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జనవరి 1 నుంచి 15 వరకు గడపగడకూ అయోధ్య పూజిత అక్షతలు పంపిణీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

దామరగిద్ద: మండలంలోని అయోధ్య రాముడి అక్షతలను శనివారం సాయంత్రం మేళా తాళాలు మంగళ వాయిద్యాలతో శోభాయాత్ర నిర్వహించారు. ఆర్ఎస్ఎస్, ఏబీవీపీ, వీఎచ్ఎపీ, బీజేపీ, తపస్ సంఘం నాయకుల ఆధ్వర్యంలో భజన మండల సభ్యులు ప్రత్యేక భజనతో గ్రామంలోని పురవీధుల గుండా అక్షతల ఊరేగింపుచేసి రామాలయానికి తరలించారు. ఇంటింటికీ అక్షతలు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. 22న రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



మరికల్‌లో అక్షతలను అందజేస్తున్న సభ్యులు



మాగనూర్‌లో ..



దామరగిద్దలో ..

వైభవంగా శ్రీనివాసుడి కల్యాణం



కల్యాణతంతు జరిపిస్తున్న వేదపండితులు

నారాయణపేట రూరల్: పట్టణ శివారులోని ఉత్తరాధిమఠం శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీనివాస కల్యాణం వైభవంగా కొనసాగింది. తెల్లవారుజామున నుంచి ఆలయంలో స్వామివారికి అభిషేకం, అర్చన, అలంకరణ, మహామంగళహారతి పూజలు నిర్వహించారు. అనంతరం లక్ష్మి గణపతి హోమం చేపట్టారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య వివాహ వేడుకను కనుల పండువగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జయతీర్థాచార్యులు, కోప్రేష్‌చారి, రఘుప్రేమ్‌జోషి, అనిల్ దేశాయ్, గోపీనాథ్‌రావు, అనిరుధ్‌ఆచార్య, డాక్టర్ శైలజ, మల్లికార్జున్, భాస్కర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, మంగళ, వసంత, సురేఖ పాల్గొన్నారు.

తపస్ క్యాలెండర్ ఆవిష్కరణ



కోస్గిలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న హెచ్‌ఎంలు, తపస్ నాయకులు



మాగనూర్‌లో ..

కోస్గి: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) క్యాలెండర్‌ను శనివారం గుండుమాల్, కోస్గి మండల కేంద్రాల్లో వేర్వేరుగా ఆవిష్కరించారు. గుండుమాల్ మండల క్యాలెండర్‌ను జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ హెచ్‌ఎం కృష్ణగౌడ్, కోస్గి మండల క్యాలెండర్‌ను కాంప్లెక్స్ హెచ్‌ఎం రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరణ నిర్వహించారు. విద్యార్థులకు చదువుతోపాటు దేశ సంస్కృతి సంప్రదాయాలను వివరిస్తూ ఉత్తమ దేశ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని తపస్ నాయకులు సూచించారు. అనంతరం ఆ సంఘం నాయకులతో కలిసి నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున్, మండల అధ్యక్ష, కార్యదర్శులు అంజిలయ్య, వెంకటేష్, రవీంద్ర నాయక్, అనంతయ్య రామాంజనేయులు, వెంకట్రాములు, నర్సింహులు, అర్జున్, నరేందర్‌రెడ్డి, రవితేజ పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని జెడ్పీహెచ్ఎస్ పెద్దజట్రం పాఠశాలలో శనివారం తపస్ మండల అధ్యక్షుడు రవికుమార్ అధ్యక్షతన నూతన క్యాలండర్‌ను విడుదల చేశారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు సత్యనారాయణ, రాంచంద్రయ్య, సీతారాములు, మాణిక్‌ప్రభు పాల్గొన్నారు.

మాగనూర్: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నతపాఠశాలలో శుక్రవారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు శేర్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారంకోసం కృషిచేస్తామని అన్నారు. 317జీఓ బాధితులకు న్యాయం చేయాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం నర్సింహ, నిజాముద్దిన్, మండల అధ్యక్ష కార్యదర్శులు రామ్మోహన్, చంద్రశేఖర్, ఉపాధ్యాయులు రాఘవేంద్ర, కళావతి, సంధ్యారాణి, అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

నారుమళ్లపై చలి ప్రభావం



చలిమంచు కారణంగా పెరగని నారుమడి

- నెల రోజులైన పెరగని వైనం
- ముందుకు సాగని యాసంగి నాట్లు

మరికల్: చలిమంచు తీవ్రత కారణంగా యాసంగి నారుమళ్లలో ఎదుగుదల లోపించింది. విత్తనాలు వేసి నెలరోజులు గడుస్తున్నా నారు పెరగకపోవడంతో వరిసాగు ఆలస్యమవుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యాసంగిలో నారుమళ్ల సాగుచేసే విధానంపై క్షేత్రస్థాయిలో అధికారులు అవగాహన కల్పించకపోవడంతో నష్టాలను చవి చూస్తున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు రైతులు అధికారులను సంప్రదించి నారుమళ్లు వేసుకుంటే సమస్యను అధిగమించేందుకు అవకాశం ఉంది.

యాజమాన్యం పద్ధతులు పాటించాలి

యాసంగిలో చలితోపాటు మంచు ప్రభావం తీవ్రంగా ఉంటుంది. ఈ సమయంలో నారు త్వరగా పెరగదు. నారుమడి సాగు చేసేముందు రైతులు ఇంతవరకు సాగుచేసిన వరి పంటలో కాకుండా ఇతర భూమిల్లో నారుమడి సాగుచేస్తే నారు త్వరగా వచ్చే అవకాశం ఉంది. యాసంగిలో వ్యవసాధికారుల సూచనలు, సలహాలు పాటిస్తే 25లోపు నాట్లు వేయవచ్చు.

– శివకుమార్, ఏఓ మరికల్

నారుమళ్లకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- నారుమళ్లు సాగుచేసే ముందు సేంద్రియ ఎరువులను వాడాలి
- నారుమళ్లలో విత్తన మొలక చల్లిన తర్వాత నీరు ఉండకుండా చూడాలి
- మూడురోజుల పాటు నీళ్లు లేకుండా జాగ్రత్త వహించాలి.
- నాలుగు రోజుల తర్వాత నారుమళ్లలోకి నీటిని వదాలాలి
- చలిమంచు తీవ్రంగా ఉంటే నారుమడిలో నీరు నిల్వ ఉండకుండా చూడాలి.
- అధికంగా నీరు ఉంటే నారుమడి తెగుళ్ల భారిన పడే అవకాశం ఎక్కువగా ఉంటుంది.
- నారుమడి వేసిన 15రోజుల తర్వాత డీఏపీని వేయాల్సింటుంది.
- తెగుళ్లు సాకిన నారుమడికి అధికారుల సలహాల మేరకు పిచికారి మందులు వాడాలి.
- యాజమాన్యం పద్ధతులను పాటిస్తే 25లోపు యాసంగి నాట్లు వేసుకోవచ్చు.

సేంద్రియ సాగుపై విద్యార్థుల ప్రచారం



వరినాట్లను పరిశీలిస్తున్న విద్యార్థులు

కోస్గి: మండల పరిధిలోని ముశ్రీఫా జెడ్పీ ఉన్నతపాఠశాల విద్యార్థులు శనివారం పంట పొలాలను సందర్శించి సేంద్రియ సాగు అవశ్యకతపై ప్రచారం చేశారు. హరిత విప్లవ మండలి పాఠశాల కో–ఆర్డినేటర్ మల్లేశం ఆధ్వర్యంలో పంటపొలాల వద్దకు వెళ్లి సాగు విధానాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో పాటు రసాయన ఎరువుల వాడకంతో జరిగే నష్టాలను, సేంద్రియ ఎరువుల వాడకంతో కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. రసాయన ఎరువులు. మందుల వాడకంతో పర్యావరణ కాలుష్యం ఏర్పడి ప్రజారోగ్యంపై ఎంతో ప్రభావం చూపుతాయని వివరించారు. ఈ సందర్భంగా పంటల సాగు విధానం, సాగులో చేపట్టే వివిధ దశలను ఉపాధ్యాయుడు విద్యార్థులకు వివరించారు. ఎనిమిదోతరగతి జీవశాస్త్రంలోని మొక్కల నుంచి ఆహారోత్పత్తి' పాఠ్యంశంలో భాగంగా కార్యక్రమం నిర్వహించినట్లు ఉపాధ్యాయుడు మల్లేశం తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.